క్లుప్తంగా

ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పుష్పేంద్రకుమార్

వినుకొండ (నూజెండ్ల): మండలంలోని ములకలూరు గ్రామంలో ఇంటింటా వైద్యం–ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జీవీ పుష్పేంద్ర కుమార్ పాల్గొని గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ అంజమ్మ, సీహెచ్‌వో మాబు సుభాని, ఏఎన్‌ఎం మహాలక్ష్మి, డీఈవో సందీప్, జగదీష్, అంగన్‌వాడీ టీచర్ దేవి, ఆశ మరియమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధికార భాషా సంఘం సభ్యుడిగా డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు

చిలకలూరిపేటటౌన్: ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యుడిగా పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ పదవిలో ఆయన రెండు సంవత్సరాల పాటు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని సింగు కల్యాణమండపంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాలనాభాషగా తెలుగును అన్ని శాఖల్లోనూ పూర్తిగా అమలు చేసే విధంగా తనవంతు కృషి చేస్తానని చెప్పారు. తెలుగు భాషపై అభిమానం ఉన్న ప్రతిఒక్కరి సహకారం తీసుకొని రానున్న రోజుల్లో తెలుగు భాషాభివృద్ధి అన్ని విధాల ప్రయత్నం చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు సాహితీ వేత్తలు, భాషా అభిమానులు వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలిపారు.

14న వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: చిరుమామిళ్ల గ్రామంలో కొలువైయున్న శ్రీ నామాల వేంకటేశ్వరస్వామి దేవాలయ నాలుగో వార్షికోత్సవం ఈ నెల 14న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు యన్నం శివారెడ్డి తెలిపారు. ఉదయం ఆలయంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. ప్రత్యేక పూజల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్తులు రానున్నట్లు తెలిపారు. వేడుకల్లో గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. నడికట్టు రామిరెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

సోలార్ ప్యానెల్స్ తీగలు అపహరణ

యడ్లపాడు: వరుస దొంగతనాలతో మండల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండల కేంద్రమైన యడ్లపాడులో తాజాగా మూడుచోట్ల ఉద్యాన తోటల్లో సోలార్ ప్యానెల్స్ నుంచి నీటి బోర్లుకు అనుసంధానం చేసే విద్యుత్ తీగలను గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. యడ్లపాడు గ్రామానికి చెందిన రైతులు పోపూరి శ్రీమన్నారాయణ, వెంకటరత్తయ్య, సింగు ప్రసాద్‌లకు యడ్లపాడు–కారుచోల గ్రామాల మధ్య ఉన్న పొలాల్లో జామ, సీతాఫలం తోటలు ఉన్నాయి. ఆయా రైతులు సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలను రాత్రిపూట గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు శుక్రవారం ఉదయం గుర్తించారు. విద్యుత్ సౌకర్యం లేక ఆయిల్ ఇంజన్లతో తోటలకు నీరు పెట్టుకోవాల్సి వస్తోందని, చోరీలను నిరోధించి పొలాల్లో సోలార్ పరికరాలకు రక్షణ కల్పించాలని బాధిత రైతులు పోలీసులను కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి పూజలు

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పంచమి చిత్తా నక్షత్రం పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిత్రకవి శ్యామ్ ఆచార్యులు రామానుజ దాసన్ శ్రీవారిని శోభాయమానంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

ముప్పాళ్ళ: ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 34,302 ఓటర్లకు గాను ఇప్పటి వరకు 27, 230 మంది ఓటరు కార్డులకు అనుసంధానం చేసుకున్నట్లు వెల్లడించారు. 78% అనుసంధానం పూర్తయిందని పేర్కొన్నారు. ఓటర్లు బీఎల్‌ఓలకు సహకరించి ఏదైనా గుర్తింపు కార్డును అందించాలని తెలిపారు.

రేపు కుష్టు వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ

క్రోసూరు: అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల్లోని కుష్టు వ్యాధిగ్రస్తులకు సోమవారం మధ్యాహ్నం నుంచి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం కిట్లను అందచేయడం జరుగుతుందని పీహెచ్‌సీ ఎంపీహెచ్‌వీ కెవి శివుడు శనివారం తెలియజేశారు. మొత్తం 40 మందికి పంపిణీ చేస్తారని తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, రాజుపాలెం మెడికల్ అధికారి కృష్ణ కుమార్, పాల్గొని పంపిణీ చేస్తారని తెలిపారు. కావున మూడు మండలాల వ్యాధిగ్రస్తులు తప్పక హాజరై కిట్లు తీసుకోవాలని కోరారు.

'ప్రభ'ంజనం కోసం..

- అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురంలో సిద్ధమవుతున్న ప్రభలు
- ఒక్కొక్కటీ 90 అడుగుల ఎత్తున నిర్మాణం
- నెలరోజులుగా శ్రమిస్తున్న గ్రామస్తులు


నిర్మాణంలో ఉన్న అప్పాపురం విద్యుత్ ప్రభ


నిర్మాణంలో ఉన్న అమీన్‌సాహెబ్‌పాలెం ప్రభ

నాదెండ్ల: చేదుకో కోటయ్య.. చేదుకో... అంటూ సాగే హరహర మహాదేవుని మహాశివరాత్రి వేడుకలకు గ్రామాల్లో భారీ ప్రభలు సిద్ధమౌతున్నాయి. ఈ నెల 18న మహాశివరాత్రిని పురస్కరించుకుని రెండు గ్రామాల్లో ప్రభల ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. మండలంలోని అప్పాపురం, అమీన్‌సాహెబ్ పాలెం గ్రామాల్లో అరశతాబ్దం పైగా భారీ ప్రభలను సిద్ధం చేసి కోటప్పకొండ సన్నిధికి తరలిస్తున్నారు. ప్రతి ప్రభకు సుమారు రూ.30 లక్షల వ్యయం కానుంది. ఈ ఏడాది జనవరి 2వ తేదీ నుంచి ఆయా గ్రామాల్లో ప్రభల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 16న ప్రభను సిద్ధం చేసి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 17న ఉదయం ప్రభలను కోటప్పకొండకు తరలించనున్నారు. 18వ తేదీన ఉదయానికి కొండ వద్దకు చేర్చనున్నారు. శివరాత్రి పర్వదినం రోజున విద్యుత్ దీపాలను అలంకరించి ప్రత్యేక వేడుకల అనంతరం 19న తిరిగి స్వగ్రామాలకు ప్రభలను తరలించనున్నారు. తిరిగి మరోదఫా గ్రామాల్లో ప్రభలకు గ్రామోత్సవం, అన్నదాన కార్యక్రమాలు జరగనున్నాయి.

14 కిలోమీటర్ల దూర ప్రయాణం

సుమారు 90 అడుగులకు పైగా ఏర్పాటు కానున్న ప్రభలను సిద్ధం చేయటం ఒక ఎత్తయితే, 14 కిలో మీటర్ల దూరంలో ఉన్న కోటప్పకొండకు తరలించటం మరో ఎత్తు. సుమారు 1500 మంది గ్రామస్తులు, యువకులు, వలంటీర్లు ప్రభలను జాగ్రత్తగా తరలించనున్నారు. రాతి గాండ్ల వాహనంపై ప్రభలను ఏర్పాటు చేసి మోకులు కట్టి లాగుతూ స్వగ్రామాల నుంచి తరలిస్తారు. తిరిగి అదేవిధంగా వ్యయ ప్రయాసలతో స్వగ్రామాలకు తరలిస్తారు.

ఈ మహాశివరాత్రికి ఎన్నడూ లేని ప్రాముఖ్యత

ఈ ఏడాది రానున్న మహాశివరాత్రికి ఎన్నడూ లేనంత ప్రాముఖ్యత సంతరించుకుంది. మహాశివరాత్రి పర్వదినానే మాసశివరాత్రి రావటం, పలు శుభ ఘడియలు ఉండటంతో భక్తులు శివరాత్రి కోసం ఎదురు చూస్తున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


ప్రభుత్వ పథకాల వివరాలను వెల్లడిస్తున్న మంత్రి విడదల రజిని

రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేటటౌన్: పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వారికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం తమదని మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 28వ వార్డు పరిధిలోని సుభానినగర్ ప్రాంతంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని ఇంటింటికీ తిరుగుతూ వారికి జరిగిన మేలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ పార్టీ వారైనా సరే ఎలాంటి వివక్ష లేకుండా సమానంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న గొప్ప ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. ప్రతి సంక్షేమ పథకం ద్వారా నేరుగా ఆర్థిక లబ్ధిని ప్రజలు పొందేలా జగనన్న చూస్తున్నారని చెప్పారు. ఎవరి బ్యాంకు ఖాతాలకు ఏ సంక్షేమ పథకం కింద ఎంత మొత్తం అందుతున్నదో చెప్పడానికే తాము ఇప్పుడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, వార్డు కౌన్సిలర్ ములకలూరి బాజీమున్ని, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు ఎస్ వెంకయ్య, సుదర్శనం నరసింహా రావు, చిన వెంకయ్య, రవి, ఎస్.కోటి, నాగుర్‌మీరా, జాను, సుబాని, ఖాదర్, అమీర్‌జాని, నజీర్, కరిముల్లా, వెంకయ్య, ఏసుబాబు, ఆర్వో కాలేషా పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు

వినుకొండ ఏబీఎం కాంపౌండ్ వివాదంపై కలెక్టర్ వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నరసరావుపేట: వినుకొండ ఏబీఎం కాంపౌండ్ వాల్‌కు సంబంధించి కోర్టు ఉత్తర్వులు మేరకు రెవెన్యూ, పోలీసు శాఖలు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ వెల్లడించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని బీఆర్ అంబేడ్కర్ హాల్లో క్రిస్టియన్ మిషనరీస్ భూముల సంబంధించిన వివాదంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ నెలలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటీ, ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చి సంయుక్తంగా తమను కలిసి ఏబీఎం కాంపౌండ్ వాల్ విషయమై సమస్య పరిష్కారాలకి అర్జీని సమర్పించారన్నారు. ఈ సందర్భంగా కోర్టు ఉత్తర్వులను అన్నింటినీ పరిశీలించామన్నారు. ఈ భూ వివాదం కోర్టు పరిధిలో ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సదరు భూముల క్రయ విక్రయాలపై జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.వినాయకం, వినుకొండ మండల రెవెన్యూ అధికారి కిరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలు పారదర్శకంగా అందించాలి

డీఎంహెచ్‌ఓ శోభారాణి


వైద్య ఆరోగ్య అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శోభారాణి

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఆరోగ్య సేవలు పారదర్శకంగా అందేలా వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యత వహించాలని పల్నాడు జిల్లా డీఎంహెచ్‌ఓ జి.శోభారాణి అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్నీ వైద్య సేవలు, సచివాలయ ఆరోగ్య సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేదని, గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం 63 రకాల వైద్య పరీక్షలతో పాటు, 175 రకాల మందులు నిత్యం అందుబాటులో ఆరోగ్య కేంద్రాల్లో ఉన్నాయన్నారు. ఫ్యామిలీ వైద్యాధికారి కార్యక్రమం తీరుపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నట్లు వెల్లడించారు. 0–5 సంవత్సరాల లోపు చిన్నారుల శ్వాసకోస వ్యాధులతో బాధపడే వారిని సర్వే చేసి వ్యాధి లక్షణాలు ఉన్న పక్షంలో సత్వరమే వైద్య సేవలు అందించాలన్నారు. చిన్నారుల మరణాల రేటు 16 శాతం ఉందని ఈసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించాల్సిన టీకాలు సకాలంలో చేయాలని సమగ్ర వివరాలు ఆన్‌లైన్ పొందుపరచాలన్నారు. ఎనీమియాతో బాధపడే గర్భిణులు ప్రసవ వేదన సమయంలో ప్రమాదకర పరిస్థితుల్లో ఉచిత రవాణా సౌకర్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రక్తహీనతతో బాధపడే గర్భిణులను ప్రాథమిక దశ నుంచి గుర్తించి నివారణ చర్యలు చేపట్టి మాతా శిశు మరణాలు నియంత్రణకు అందరు భాగస్వామ్యం వహించాలన్నారు. జిల్లా టీకా అధికారి డాక్టరు గీతాంజలి, ప్రోగ్రాం అధికారి డాక్టరు నాగ పద్మజ, సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, వైద్యాధికారులు సయ్యద్ ఇబ్రహీం, వేముల వెంకట భాస్కర్, స్టాఫ్‌నర్సులు లక్ష్మి ప్రసన్న కుమారి, ధనలక్ష్మి, ప్రమీల, ఫార్మాసిస్ట్ లక్ష్మి నారాయణ, సాయిగీతా, ఉమాదేవి పాల్గొన్నారు.

కారణ జన్ములు పండిట్ దీన దయాళ్


దీనదయాళ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

నరసరావుపేట: భారతీయ జనతా పార్టీ పూర్వ రూపమైన జనసంఘ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన పండిట్ దీన్ దయాళ్ కారణ జన్ములని అసెంబ్లీ ఇన్‌చార్జి రంగిశెట్టి రామకృష్ణ అన్నారు. శనివారం దీన దయాళ్ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మరణించే వరకు జీవించి ఉంటారనీ, మరణించిన తరువాత కూడా జన హృదయాల్లో జీవించి ఉన్న వారిలో దీనదయాళ్ ఒకరన్నారు. అటువంటి గొప్ప ఏకాత్మతా మానవతా సిద్ధాంత కర్త, అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత దీన్ దయాళ్‌ను స్మరించుకుంటూ వారి భావజాలాన్ని నిరంతరం చర్చిస్తూ సమాజంలో అట్టడుగు వర్గాల వారికి అందరికి అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ప్రతి ఒక్క భారతీయుడు వెన్నుదన్నుగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఇత్తడి కిరణ్, ఐబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకుల చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అడపా గురునాధరావు, రూరల్ మండల అధ్యక్షుడు చంద్రపాటి సత్యనారాయణ, పట్టణ ఉపాధ్యక్షుడు తవ్వా మల్లికార్జునరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి చిలకల రత్తయ్య పాల్గొన్నారు.

లోక్ అదాలత్.. అంతిమ తీర్పు

సత్తెనపల్లి: రాజీ మార్గమే రాజ మార్గమని అని సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగవెంకటలక్ష్మీ అన్నారు. శనివారం సత్తెనపల్లి పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల పరిధిలో మూడు బెంచ్‌లుగా ఏర్పాటు చేసి లోక్ అదాలత్ కేసులు పరిష్కరించారు. మొదటి బెంచ్‌కు న్యాయమూర్తిగా సీనియర్ సివిల్ జడ్జి డి. నాగ వెంకటలక్ష్మి, మెంబర్‌గా న్యాయవాది నల్లిబోయిన ఆంజనేయులు వ్యవహరించారు. రెండవ బెంచ్‌కు న్యాయమూర్తిగా కుమారి కడియాల ప్రశాంతి ఇన్‌చార్జి, మెంబరుగా న్యాయవాది బి.లక్ష్మీకోటేశ్వరరావు వ్యవహరించారు. మూడవ బెంచ్ కు సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ న్యాయమూర్తిగా, లోక్ అదాలత్ సభ్యుడిగా న్యాయవాది ఆకుల నాగార్జున వ్యవహరించారు. పట్టణంలోని అన్ని కోర్టుల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 637 కేసులు పరిష్కరించారు. వీటిల్లో సివిల్ కేసులు 8, క్రిమినల్ కేసులు 138, ఎన్‌ఐ యాక్ట్ కేసులు 8, ఎంసీ కేసులు 2, డీవీసీ కేసులు 3, పీఎల్‌సీ కేసులు 11, ఎస్‌టీసీ కేసులు 491, వెరశి మొత్తం 661 కేసులు పరిష్కారం అయ్యాయి. వీటి ద్వారా రూ.65,25,783 నగదు చేతులు మారింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారురి లింగారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన భవనానికి ఎమ్మెల్యే నిధులు

- అసోసియేషన్ అధ్యక్షుడికి అందజేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- పౌడా చైర్మన్ మిట్టపల్లిని సన్మానించిన వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్


న్యాయవాదులకు అనుమతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: స్థానిక బార్ అసోసియేషన్ నూతన భవన నిర్మాణానికి తన నిధుల నుంచి రూ.25 లక్షలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శనివారం జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాకుమాను బాలా హనుమంతారెడ్డి ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. దీనిపై ఆయన నిధులకు సంబంధించి అనుమతిపత్రాన్ని న్యాయవాదులకు అందజేశారు. న్యాయవాదుల ప్రయోజనం కోసం నూతన భవనం త్వరగా నిర్మాణం చేసుకోవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పౌడా చైర్మన్ మిట్టపల్లికి సన్మానం

కాగా, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సమక్షంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పౌడా) చైర్‌పర్సన్ మిట్టపల్లి రమేష్, విజయవాడ కనకదుర్గమ్మ ట్రస్టు బోర్డు సభ్యులు నిడమానూరి కల్యాణీ సురేంద్ర బాబులను దుశ్శాలువ కప్పి పూలదండలు వేసి ఘనంగా సన్మానించారు. వారికి లీగల్ సెల్ తరఫున అభినందనలు తెలియచేశారు. కార్యక్రమంలో లీగల్ సెల్ అధ్యక్షుడు గాలి జయప్రకాష్, న్యాయవాదులు ఆరెకూటి శ్రీనివాసరెడ్డి, పిడుగు రవిశంకర్, సుభాషిణి, బ్లెస్సీనా, వై. సీతారామిరెడ్డి, బుచ్చి దంతాచారి, పడాల అప్పిరెడ్డి, షేక్ షరీఫ్, షంషేర్ ఆలీ పాల్గొన్నారు.

లోక్ అదాలత్ 502 కేసులు పరిష్కారం


లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి తాషిద్‌హుస్సేన్

వినుకొండ(నూజెండ్ల): స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోరులో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎ.తాషిద్ హుస్సేన్ పాల్గొని మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, నగదు ఆదా అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రాజమార్గమే రాజమార్గమని తెలియజేశారు. ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ కేసులు, ప్రామిసరీ నోట్, చెక్‌బౌన్స్, మనోవర్తి, భార్యాభర్త తగాదాలు, గృహహింస, విడాకులు, ప్రైవేటు కేసులు, ఫ్రీ లిటిగేషన్ కేసులు పెట్టీ కేసులు తదితర కేసులను రాజీ చేయడం జరిగిందన్నారు.మొత్తం 100 కేసులను రాజీ చేసి రూ.91,80,519లు కక్షిదారులకు ఇప్పించడం జరిగిందని ఆయన వివరించారు. అలాగే ఎస్‌టీసీ కేసులు సుమారు 402 పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఆరె సామ్రాజ్యం, రమణారెడ్డి, శ్రీనివాసరావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, వినుకొండ పట్టణ, రూరల్ పోలీసులు, కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేటటౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ, చిలకలూరిపేట ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ లోక్‌అదాలత్‌లో మొత్తం 413 కేసులు పరిష్కరించినట్లు న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవేంద్రరెడ్డి తెలిపారు. ఈ కేసుల ద్వారా కక్షిదారులకు రూ. 61,56,350 చెల్లించినట్లు తెలిపారు.

కేంద్ర బడ్జెట్ కార్పొరేటుకు తొత్తుగా ఉంది

శ్రామిక మహిళ సంఘం కన్వీనర్ డి.శివకుమారి


సదస్సులో మాట్లాడుతున్న డి.శివకుమారి

శావల్యాపురం: కేంద్ర బడ్జెట్ కార్పొరేటు సంస్థలకు తొత్తులుగా ఉందని శ్రామిక మహిళ సంఘం కన్వీనర్ డి.శివకుమారి అన్నారు. శనివారం సీఐటీయూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం పిలుపు మేరకు కౌలు రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక, కర్షక ఐక్యత సదస్సు శావల్యాపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డి.శివకుమారి మాట్లాడుతూ కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరుపై వ్యతిరేకంగా ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో జరిగే మహాప్రదర్శన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో ఆదానీ, అంబానీ కార్పొరేటు సంస్థలకు ప్రయోజనం కల్గించే విధంగా ఉందని విమర్శించారు. 8 సంవత్సరాల మోదీ పాలనలో సామాన్యులపై భారాలు వేయటం, కార్పొరేటు సంస్థలకు మాత్రం ఊడిగం చేయటంతో కొంతమంది మాత్రమే కోట్లకు పడగనెత్తారన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరు విధివిదానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

కౌలు రైతులకు రాయితీలు అందటం లేదని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర గ్యారంటీ చట్టం కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కంతెటి శివ రామకృష్ణ, రైతుసంఘం నాయకులు కె.వి.ఆర్. మోహన్‌చంద్, సీఐటీయూ మండల కార్యదర్శి భువనగిరి వెంకటేశ్వర్లు, సువార్త తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల సారథులు వీరే

కన్వీనర్లు, కో కన్వీనర్ల నియామకం

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు, కోకన్వీనర్లను వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. మండలానికి కన్వీనర్‌తో పాటు కో కన్వీనర్లను నియమించారు. వినుకొండ నియోజకవర్గం వివరాలు...

బొల్లాపల్లి మండలం...

మండల కన్వీనర్‌గా డి.రవి, కోకన్వీనర్లుగా శివచరణ్, ఎం.శ్రీహరినాయక్, జి.సాగర్, జి.శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనాయక్‌లను నియమించారు.

నూజెండ్ల మండలం....

మండల కన్వీనర్‌గా టి. బసవారెడ్డి, కోకన్వీనర్లుగా పి.మంగారావు, డి.అభిలాష్, టి.రామకృష్ణారెడ్డి, డి.మల్లికార్జునరెడ్డిలను నియమించారు.

వినుకొండ రూరల్ మండలం....

మండల కన్వీనర్‌గా కల్లం అనిల్‌కుమార్‌రెడ్డి, కోకన్వీనర్లుగా ఎస్.రఘు, డి.సూర్య, హరిష్‌సింగ్, గోవిందరెడ్డిలను నియమించారు.

వినుకొండ టౌన్....

టౌన్ కన్వీనర్‌గా గౌస్, కో కన్వీనర్లుగా కె.రమేష్, బైరెడ్డి అంకిరెడ్డి, చందోలు నాగాంజి, చల్లా రాజును నియమించారు.

శావల్యాపురం మండలం....


మండల కన్వీనర్‌గా అబ్బూరి శ్రీనివాస్, కో కన్వీనర్లుగా జి. నారాయణ చౌదరి, ఆర్. రామకోటేశ్వర రావు, వై.గోపి, టి. కిషోర్‌లను నియమించారు.

ఈపూరు మండలం..

ఈపూరు: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్, కో కన్వీనర్లను నియమించినట్లు పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. ఈపూరు మండల కన్వీనర్‌గా కొండవర్జు సుబ్బుయాదవ్, కోకన్వీనర్లుగా ఓబులశెట్టి భవాని శంకర్, వినుకొండ వెంకటేష్‌బాబు, చల్లా శ్రీనివాస్‌యాదవ్, పులుకూరి కిరణ్‌కుమార్, కూరాకుల రాజులను నియమించారు. వీరిని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కోపెల దేవరాజ్, జెడ్పీటీసీ సభ్యులు తుర్లపాటి చౌదయ్య, పార్టీ నాయకులు శాకమూరి బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకటహనుమయ్య తదితరులు అభినందించారు.

నరసరావుపేట: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులను పార్టీ కేంద్ర కార్యాలయం ఎంపిక చేసింది. ఈ మేరకు విడుదల చేసిన వివరాల ప్రకారం నరసరావుపేట మండల కన్వీనర్‌గా అమ్మలపూడి నరసింహారావు, మండల కో–కన్వీనర్లుగా గడిబోయిన వీరాంజనేయులు, చెరుకూరి కాశీరామ్, కొండపల్లి శివ, నడికట్టు శ్రీకాంతరెడ్డి, కోటిరెడ్డిని నియమించారు. అలాగే రొంపిచర్ల మండల కన్వీనర్‌గా మొండితోక ఏసుదాసు, కో కన్వీనర్లుగా షేక్ రఫీ, కిషోర్‌రెడ్డి, యర్రం అశోక్‌రెడ్డి, లక్షణరాజు, నరసరావుపేట టౌన్ కన్వీనర్‌గా పోలకం బ్రహ్మరెడ్డి, కో–కన్వీనర్లుగా ద్వారగా వాసు, చెర్రీ సాయి, హన్ను, షేక్ మహబూబు బాష నియమితులయ్యారు.

ఆత్మవిశ్వాసమే ఆయుధంగా..


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న తులసీ

సత్తెనపల్లి: ఆత్మవిశ్వాసాన్ని ఆయుధంగా మలుచుకుంటే.. విజయం సాధించవచ్చునని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సత్తెనపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ తులసీ పేర్కొన్నారు. మండలంలోని రామకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థినులకు విద్య–ప్రేరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ బలిజేపల్లి రమా దేవి సోషల్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ స్వర్ణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఐ తులసీ మాట్లాడుతూ.. సానుకూల దృక్పథంతో ఉండాలని, పరీక్షల సమయంలో ఆందోళన చెందొద్దని సూచించారు. సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి మాట్లాడుతూ విద్యార్థినులు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ.. చదువు ఒక్కటే ఉన్నత స్థితికి చేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బలిజేపల్లి విజయ్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు సురేష్, శేఖర్, లత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి


చిన్నారుల బరువు నమోదును పరిశీలిస్తున్న ఎంపీపీ

బొల్లాపల్లి: గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం భుజించాలని ఎంపీపీ బి. రాములు చెప్పారు. మండలంలోని రావులాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఎంపీపీ, సూపర్‌వైజర్ వి.శ్రీదేవిలు సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారుల బరువు కొలతలు నమోదు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం పోషక విలువలతో కూడిన ఆహారం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.